
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అల్లూరి సీతారామరాజు జిల్లా వార్తలు
శనివారం 6 జనవరి 2024





జ్ఞానాపురంలో టీడీపీ కార్యకర్త మల్లిరెట్టి రమణ కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం ప్రజలకు నమస్కరిస్తున్న నారా భువనేశ్వరి

మన్యంలో ముమ్మరంగా నూర్పులు

మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో నెల ఆలస్యం

- వరి నూర్పిడికి యంత్రాలు వినియోగం
- పాత పద్ధతులతో పోలిస్తే ఖర్చులు, సమయం ఆదా
- సంప్రదాయ రీతిలోనే రాగి పంట నూర్పులు



పాడేరు శివారులో యంత్రంతో వరి పైరును నూర్చుతున్న రైతులు

(ఆంధ్రజ్యోతి- పాడేరు)

ఏజెన్సీలో వరి, రాగి పంటల నూర్పిడి పనుల్లో గిరిజన రైతులు బిజీగా వున్నారు. ఎక్కడ చూసినా వరి నూర్చడం, ధాన్యం తూర్పారపట్టడం, బస్తాల్లో నింపి ఇళ్లకు తరలిస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. రాగి కంకులను సంప్రదాయ పద్ధతుల్లోనే నూర్పులు చేస్తుండగా, వరి పంటను మాత్రం యంత్రాలతో నూర్చుకుంటున్నారు.

గత ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ శాఖ అధికారులు లెక్కల ప్రకారం జిల్లా వ్యాప్తంగా 59,189 హెక్టార్లలో వరి, 18,918 హెక్టార్లలో రాగి పంటను వేశారు. సాధారణంగా ఏటా నవంబరు, డిసెంబరు నెలల్లో వరి, చోడి పంటల కోత, కుప్ప, నూర్పు పనులు చేస్తుంటారు. కానీ ఈ ఏడాది వరి పంట కోతలు, కుప్ప దశల్లో ఉన్నప్పుడు మిచౌంగ్ తుపాన్ విరుచుకుపడింది. భారీ వర్షాలు పడడంతో వారం నుంచి పది రోజులపాటు పొలాల్లో నీరు నిలిచింది. తరువాత పొడి వాతావరణం లేకపోవడం, ఆకాశం మేఘావృతమై ఎండ కాయకపోవడం, మంచు ప్రభావం పెరగడం వంటి కారణాల వల్ల వరి, రాగి పంటల కోతలు, నూర్పులు ఆలస్యం అయ్యాయి. వరి పనలు, రాగి కంకులు బాగా ఆరడంతో కొద్ది రోజుల నుంచి నూర్పుల పనుల్లో నిమగ్నమయ్యారు. సంక్రాంతి పండుగ సమీపిస్తుండడంతో ఈలోపే నూర్పులు పూర్తిచేసి వడ్లు, రాగులను ఇళ్లకు చేర్చుకునే ప్రయత్నాల్లో వున్నారు. కుటుంబ అవసరాలకు సరిపడ ధాన్యం, రాగులను వుంచుకుని, మిగిలిన పంటను సంతల్లో విక్రయించుకుంటారు. వచ్చిన సొమ్ముతో పండుగకు, కుటుంబ అవసరాలకు కావాల్సిన సామగ్రి, సరకులు, వస్తువులను కొనుగోలు చేసుకుంటారు.

వరిఇ నూర్పు యంత్రాలతో సమయం, ఖర్చులు ఆదా

సుమారు పదేళ్ల క్రితం వరకు గిరిజన రైతులు వరి పంటను సంప్రదాయ పద్ధతిలోనే నూర్చుకునే వారు. వరి పైరును కోసి, పనలు ఎండిన తరువాత మెరక ప్రదేశాల్లో కుప్పలుగా వేసుకుంటారు. అనంతరం వెసులుబాటు చూసుకుని పశువుల సాయంతో నూర్చుకునేవారు. అయితే వరి నూర్పులకు యంత్రాలు రావడంతో గిరిజన రైతులు సంప్రదాయ పద్ధతులకు స్వస్తి పలికి యంత్రాలతో పంటను నూర్చుకుంటున్నారు. దీనివల్ల సమయం, ఖర్చులు ఆదా అవుతాయని చెబుతున్నారు. ఐదారేళ్ల క్రితం కొద్ది మంది రైతులతో మొదలైన యంత్రాలతో నూర్పిడి, ఈ ఏడాది దాదాపు సగం మంది రైతులు పూర్తిగా యంత్రాలపైనే ఆధారపడి వరి పంటను నూర్చుకుంటున్నారు. పాత పద్ధతిలో పశువుల సాయంతో రోజుకు ఒక ఎకరా పంటను నూర్చుకునేవారు. ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లు వచ్చిన తరువాత ఎకరా వరిపంటను నూర్చడానికి మూడు గంటలు పడుతుంది. తరువాత తూర్పారబట్టడం అదనపు పని. ఈ విధంగా అయితే ఎకరాకు రూ.4,500 వరకు ఖర్చు అవుతుంది. అదే యంత్రంతో నూరిస్తే రూ.1,500లతో గంటలోపే పని పూర్తవుతున్నది. పాత పద్ధతుల్లో అయితే పంట నూర్చిన తరువాత ధాన్యం తూర్పార పట్టాలంటే గాలి కోసం ఎదురుచూడాల్సి వచ్చేది. ఒక్కోసారి నూర్చిన రోజు తూర్పారకు సరిపడ గాలి వీచకపోతే ధాన్యాన్ని కల్లంలోనే వుంచి, మరుసటి రోజో, ఆ తరువాత తూర్పారపట్టాల్సి వచ్చేది. నూర్పిడి యంత్రాలు అందుబాటులోకి వచ్చిన తరువాత ఈ సమస్య తొలగిపోయింది.



మినుములూరులో రాగి కంకులను నూర్చుకుంటున్న గిరిజన రైతులు

సంప్రదాయ పద్ధతిలోనే రాగి నూర్పులు

గిరిజన రైతులు వరి నూర్పులకు భిన్నంగా రాగి పంటను సంప్రదా పద్ధతిలోనే నూర్చుకుంటున్నారు. పొలంలో పంట పండిన తరువాత రాగి కంకులను కోసి ఎండబెడతారు. బాగా ఎండిన తరువాత కుప్పగా పోసి దుడ్డు కర్రతో మోదుతారు. కంకుల నుంచి గింజలు వేరైన తరువాత తూర్పారపడతారు.

పార్టీ అండగా ఉంటుంది

చంద్రబాబునాయుడు అరెస్టును జీర్ణించుకోలేక మృతిచెందిన వారి కుటుంబాలకు నారా భువనేశ్వరి భరోసా

- మృతుల కుటుంబాలకు పరామర్శ
- కష్టకాలంలో తమ కుటుంబానికి అండగా నిలవడంతో పాటు పార్టీ అభివృద్ధికి శ్రమిస్తున్న వారందరికీ తోడుగా ఉంటామని ప్రకటన
- నగరంలో 'నిజం గెలవాలి' యాత్ర



దక్షిణ నియోజకవర్గ పరిధిలోని వెంకటేశ్వర మెట్టలో జాగారపు చిన్న కుటుంబానికి రూ.3 లక్షల చెక్ అందజేస్తున్న నారా భువనేశ్వరి

విశాఖపట్నం/గాజువాక, జనవరి 5 (ఆంధ్రజ్యోతి):

"మీ నాయకుడు చంద్రబాబునాయుడు నన్ను పంపించారు. మీకు అన్నివిధాలా సహాయ, సహకారాలు అందుతాయి. పార్టీ అండగా ఉంటుంది. ఆందోళన చెందొద్దు, ధైర్యంగా ఉండండి"

- ఇదీ చంద్రబాబునాయుడు అరెస్టును జీర్ణించుకోలేక మృతిచెందిన కార్యకర్తల కుటుంబాలకు నారా భువనేశ్వరి ఇచ్చిన భరోసా

'నిజం గెలవాలి' యాత్ర రెండో దశలో భాగంగా ఆమె శుక్రవారం నగరంలో పర్యటించారు. మృతుల కుటుంబాలను పరామర్శించారు. ఆర్థిక సాయం అందజేశారు. తొలుత దక్షిణ నియోజకవర్గ పరిధిలోని వెంకటేశ్వర మెట్ట ప్రాంతానికి చెందిన జాగారపు చిన్న ఇంటికి వెళ్లారు. చిన్న భార్య గౌరిని, పిల్లలు దేవి, కిరణ్‌కుమార్, నందినిని భువనేశ్వరి పరామర్శించారు. ఈ సందర్భంగా గౌరి మాట్లాడుతూ తన భర్త నందమూరి తారక రామారావుపై అభిమానంతో పార్టీలో పనిచేసేవారన్నారు. చంద్రబాబు నాయుడు జైలు పాలుకావ డాన్ని తట్టుకోలేక మృతిచెందారని కన్నీటిపర్యంత మవ్వగా.. భువనేశ్వరి ఓదార్చారు. చదువు పూర్తిచేసిన తన కుమారుడికి ఉద్యోగం ఇవ్వాలని కోరగా ప్రభుత్వం వచ్చిన తరువాత ఆదుకుంటా మని హామీ ఇచ్చారు. చిన్న కుటుంబానికి భువనేశ్వరి రూ.మూడు లక్షల చెక్కు అందజేశారు. తరువాత జ్ఞానాపురం వెళ్లి మలిశెట్టి రమణ కుటుంబాన్ని పరామర్శించారు. రమణ చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబానికి రూ.మూడు లక్షల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా రమణ కుమారుడు, 41వ వార్డులో 17వ బూత్ అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ తన తండ్రి రమణ...ఎన్టీఆర్ అభిమానిగా ఉండేవారని, తరువాత పార్టీలో చేరి చివరి వరకూ పనిచేశారన్నారు. చంద్రబాబునాయుడు అరెస్టును తట్టుకోలేక పోయారని, బెయిల్ విషయంలో జాప్యం జరగడంతో మరింత మనస్తాపానికి గురై చనిపోయారన్నారు. భువనేశ్వరి స్పందిస్తూ అధైర్యపడొద్దని, అన్ని విధాలా పార్టీ అండగా ఉంటుందన్నారు. ఆ తరువాత భువనేశ్వరి విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిధిలోని తాటిచెట్ల పాలెంలో పంచిరెడ్డి కనకారావు ఇంటికి వెళ్లి, ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. కనకారావు సతీమణి పార్వతి, కుమారుడు శ్యామ్, కుమార్తె ఉదయశ్రీలకు ధైర్యం చెబుతూ రూ.మూడు లక్షల చెక్ అందజేశారు. వృత్తి రీత్యా ఆటోడ్రైవర్ అయిన తన భర్త పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారని, చంద్రబాబును జైలులో పెట్టడాన్ని తట్టుకోలేక చనిపోయారని కనకారావు సతీమణి పార్వతి బోరుమన్నారు. ఇంజనీరింగ్ చేసిన తన కుమారుడికి ఉద్యోగం ఇప్పించాలని కోరగా టీడీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత చూస్తామని హామీ ఇచ్చారు. మురళీ నగర్‌లో భోజనం చేసిన అనంతరం గాజువాక వెళ్లారు. బీసీ రోడ్డుకు చెందిన కోరుకొండ వెంకటరమణ, భానోజీ కాలనీ ప్రాంతానికి చెందిన ఉప్పలపాటి సరోజినీదేవి కుటుంబాలను పరామర్శించి రూ.3 లక్షల చొప్పున చెక్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం వస్తుందని, మీ కుటుంబాలకు మరింత చేయూతనిచ్చి తోడునీడగా ఉంటామని ధైర్యం చెప్పారు. అనంతరం షీలానగర్‌లో పమిడిముక్కల రాధాకృష్ణమూర్తి (టీడీపీ బాబాయి) కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన ... మిగతా 8వ పేజీలో



గాజువాక 65వ వార్డులో రాధాకృష్ణమూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న భువనేశ్వరి

నర్సింగపేట ఆశ్రమ పాఠశాలలో బాలిక మృతి

హెచ్‌ఎం, వార్డెన్ నిర్లక్ష్యమంటూ బంధువులు రాస్తారోకో

- నేడు విచారణ జరపాలని ట్రైబల్ వెల్ఫేర్ డీడీకి ఐటీడీఏ పీవో ఆదేశం





బాలిక మృతదేహంతో రాస్తారోకో చేస్తున్న బంధువులు టీడీపీ నాయకులు. (ఇన్‌సెట్‌లో) మడకం సంధ్య (ఫైల్ ఫొటో)

కూనవరం, జనవరి 5: మండలంలోని నర్సింగపేట గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న మడకం సంధ్య(12) అనే బాలిక కడుపునొప్పితో మృతిచెందింది. అయితే ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, వార్డెన్ నిర్లక్ష్యం వల్లనే బాలిక మృతిచెందిందంటూ కుటుంబ సభ్యులు, బంధువులు పాఠశాల ఎదుట నాలుగు గంటలపాటు రాస్తారోకో నిర్వహించారు. మృతురాలి బంధువుల కథనం ప్రకారం. ఎటపాక మండలం ఎర్రబోరు గ్రామానికి చెందిన సంధ్య నర్సింగపేట ఆశ్రమ పాఠశాలలో 6వ తరగతి చదువుతోంది. ఈనెల ఒకటిన తీవ్రమైన కడుపునొప్పి వచ్చింది. ఆ సమయంలో పాఠశాల సిబ్బంది నూతన సంవత్సర వేడుకల్లో మునిగితేలడంతో సంధ్యను పట్టించుకోదు. సిబ్బంది కూడా హాస్టల్‌లో అందుబాటులో లేరు. మరుసటి రోజు వరకు కడుపునొప్పితో బాధపడుతూనే వుంది. రెండో తేదీన పాఠశాల సిబ్బందికి చెప్పడంతో ఆయాతో కోతులగుట్ట ప్రభుత్వ ఆస్పత్రికి పంపారు. వార్డెన్‌గానీ, క్లాస్ టీచర్ గాని వెంట వెళ్లలేదు. కాగా ఆస్పత్రిలో చికిత్స అనంతరం సంధ్య పాఠశాలకు తిరిగివచ్చి సిక్ రూమ్‌లో ఉంది. ఇదే సమయంలో ఎర్రబోరుకు చెందిన ఓ మహిళ ఈ పాఠశాలలో చదువుతున్న తన కుమార్తెను చూడడానికి వచ్చింది. సిక్‌రూమ్‌లో ఉన్న సంధ్య ఆరోగ్య పరిస్థితి గమనించి ఇంటికివెళ్లి (బాలికకు తల్లిదండ్రులు లేరు) సంధ్య పెద్దమ్మకు చెప్పింది. ఆమె వెంటనే పాఠశాలకు వచ్చి సంధ్యను ఇంటికి తీసుకువెళతానని హెచ్‌ఎంకు చెప్పింది. దీంతో బాలికకు ఏమైనా జరిగితే తమకు ఎటువంటి బాధ్యతలేదంటూ ఆమె నుంచి లేఖ రాయించుకుని సంధ్యను ఇంటికి పంపించారు. గురువారం మళ్లీ తీవ్ర కడుపునొప్పి వచ్చింది. చికిత్స నిమిత్తం భద్రాచలం ఆస్పత్రికి తరలిస్తుండగా దారిలో మృతిచెందింది. పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే సంధ్య చనిపోయిందంటూ ఆమె బంధువులు మృతదేహన్ని తీసుకువచ్చి రాస్తారోకో నిర్వహించారు. విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. శనివారం విచారణ నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య, ట్రైబల్ వెల్ఫేర్ డీడీని ఆదేశించారు.

పీఎం జన్‌మన్‌తో ఆదివాసీల అభివృద్ధి

పీవీటీజీ గ్రామాలకు మౌలిక వసతులు

- ప్రతి కుటుంబానికి ఉచితంగా ఇల్లు, వంట గ్యాస్ కనెక్షన్
- కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ ఉప కార్యదర్శి మనోజ్‌కుమార్ సింగ్

అరకులోయ, జనవరి 5:

ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పీఎం-జన్‌మన్) కార్యక్రమం కింద కేంద్ర ప్రభుత్వం ఆదివాసీ(పీవీటీజీ) గ్రామాలకు మౌలిక వసతులు కల్పించి సంపూర్ణ అభివృద్ధికి కృషిచేస్తున్నదని కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఉప కార్యదర్శి మనోజ్‌కుమార్ సింగ్ అన్నారు. శుక్రవారం అరకులోయ మండలం కొత్తభల్లుగుడ గ్రామంలో నిర్వహించిన 'పీఎం జన్‌మన్' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, పీవీటీజీ గ్రామాల్లో ప్రతి కుటుంబానికి ఉచితంగా వంట గ్యాస్ కనెక్షన్, విద్యుత్తు, తాగునీటి సదుపాయాలు కల్పిస్తామని, ఆయుష్మాన్ భారత్ కార్డులు అందజేస్తామని చెప్పారు. పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ మాట్లాడుతూ, పీఎం జన్‌మన్ కార్యక్రమం కింద ప్రతి పీవీటీజీ కుటుంబానికి పక్కా ఇల్లు, ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు మంజూరు, ఉచితంగా సికిల్ సెల్ ఎనీమియా పరీక్షలు చేయిస్తామని చెప్పారు. పీవీటీజీల జీవనోపాధిని మెరుగుపర్చేందుకు ఐటీడీఏ ప్రత్యేకంగా కృషి చేస్తుందన్నారు. పాడేరు ఐటీడీఏ పరిధిలో 1,597 పీవీటీజీ గ్రామాల్లో గిరిజన కుటుంబాల ఆర్థిక పరిస్థితి, జీవనోపాధి, మౌలిక సదుపాయాలు, తదితర అంశాల సమగ్ర సర్వే చేశామని చెప్పారు. జనవరి 15వ తేదీన ప్రధానమంత్రి జన్‌మన్ కార్యక్రమం ప్రారంభం అవుతుందని తెలిపారు. ప్రతి కుటుంబం పక్కా ఇల్లు మంజూరు కోసం పేర్లు నమోదు చేయించుకోవాలని, ప్రభుత్వం ఒక్కో ఇంటికి రూ.2.39 లక్షలు అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఉజ్వల్ పథకం కింద పలువురికి ఉచిత వంట గ్యాస్ కనెక్షన్లు అందజేశారు.

కాగా అంతకుముందు కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఉప కార్యదర్శి మనోజ్‌కుమార్ సింగ్‌కు ధింసా నృత్యంతో గిరిజన కళాకారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ శాఖ బాలిక ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించారు. కార్యక్రమం ముగిసిన తరువాత అరకులోయ చేరకుని గిరిజన మ్యూజియం, పద్మాపురం గార్డెన్స్‌ను సందర్శించారు. మేనేజర్ బొంజిబాబు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. మనోజ్‌కుమార్ సింగ్ పద్మాపురం గార్డెన్స్‌లో మొక్క నాటారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవోలు వి.ఎస్.ప్రభాకరరావు, ఎం.వెంకటేశ్వరరావు, టీసీఆర్ అండ్ టీఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఇ.చినబాబు, పీఐయూ ఈఈ కె.లావణ్యకుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ లీలాకృష్ణ, ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, ఎంపీడీవో వెంకటేస్, తహసీల్దారు వేణుగోపాల్, సర్పంచ్ కొర్రా రాధిక, తదితరులు పాల్గొన్నారు.



కొత్తభల్లుగుడలో పీవీటీజీలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేస్తున్న కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఉప కార్యదర్శి మనోజ్‌కుమార్ సింగ్, ఐటీడీఏ పీవో అభిషేక్, తదితరులు



కార్యక్రమానికి హాజరైన ఆదివాసీ గిరిజనులు



పాడేరులో శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల సమయంలో దట్టంగా కమ్ముకున్న పొగమంచు

మన్యంలో తగ్గని పొగ మంచు

స్థిరంగా కొనసాగుతున్న కనిష్ఠ ఉష్ణోగ్రతలు

- అరకులోయలో 8.7, పాడేరులో 12, చింతపల్లిల్లో 12.3 డిగ్రీలు నమోదు

పాడేరు (ఆంధ్రజ్యోతి), చింతపల్లి, జనవరి 5: ఏజెన్సీలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు స్థిరంగా కొనసాగుతున్నాయి. చలి, మంచు తీవ్రత మాత్రం తగ్గడంలేదు. శుక్రవారం అరకులోయలో 8.7, పాడేరులో 12, చింతపల్లిలో 12.3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉత్తరాది నుంచి శీతలగాలులు వీస్తుండడంతో మరికొన్ని రోజులు చలి వాతావరణం కొనసాగే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ సూచిస్తున్నది. మన్యంలో తెల్లవారుజాము నుంచి ఉదయం తొమ్మిదిన్నర గంటల వరకు దట్టంగా పొగ మంచు కురుస్తున్నది. విజిబిలిటీ వంద మీటర్ల దూరంకు తగ్గిపోయింది. దీంతో వాహనదారులు హెడ్‌లైట్లు వేసుకుని నెమ్మదిగా రాకపోకలు సాగిస్తున్నారు. మధ్యాహ్నం ఒకటి, రెండు గంటలపాటు కొద్దిపాటి ఎండ కాస్తుండగా, సాయంత్రం మూడు గంటల నుంచే చలిగాలులు వీస్తున్నాయి. దీంతో సూర్యాస్తమయం తరువాత జనం ఇళ్లకే పరిమితం అవుతున్నారు. మండల కేంద్రాలతోపాటు జిల్లా కేంద్రమైన పాడేరులో కూడా రాత్రి ఎనిమిది గంటల తరువాత రోడ్లపై జన సంచారం వుండడంలేదు.



చింతపల్లిలో కురుస్తున్న మంచు

25వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె



ఐటీడీఏ ఎదుట ఏర్పాటు చేసిన శిబిరంలో దీక్ష చేస్తున్న అంగన్‌వాడీలు

సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శుక్రవారం 25వ రోజుకు చేరింది. గత ఎన్నికల ముందు జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తరువాత అమలుచేయకుండా మొండిగా వ్యవహరిస్తున్నారని అంగన్‌వాడీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. చింతపల్లిలో 'వద్దు వద్దు జగనన్న.. మీ పాలన మాకొద్దు' అంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు ధింసా నృత్యం చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.

17వ రోజుకు ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల సమ్మె



పాడేరులో నిరసన దీక్ష చేస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు

డిమాండ్ల సాధన, దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగులు చేపట్టిన సమ్మె శుక్రవారానికి 17వ రోజుకు చేరింది. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన నిరసన శిబిరంలో సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.అనిల్‌కుమార్, కార్యదర్శి వి.జయరాజ్ మాట్లాడుతూ, ప్రభుత్వం ఎన్ని బెదిరింపులకు పాల్పడినప్పటికీ సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మెను ఆపేది లేదని స్పష్టం చేశారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యం

- టీడీపీ అరకు అసెంబ్లీ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర - 8లో

క్రైం... crime news

34 కిలోల గంజాయితో ఇద్దరి అరెస్టు

రోలుగుంట, జనవరి 5: మండలంలోని బీబీపట్నం శివారు ఊడివారి పాకల వద్ద 34 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ సురేష్ తెలిపారు. ఏజెన్సీ నుంచి గంజాయిని తీసుకువచ్చి బీబీపట్నం ఊడివారి పాకల వద్ద దాచిపెట్టినట్టు బుధవారం రాత్రి ముందస్తు సమాచారం అందిందన్నారు. దీనిపై వెంటనే సిబ్బందితో దాడిచేసి గంజాయితో పాటు ఇద్దరు వ్యక్తులకు అదుపులోకి తీసుకున్నామని, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ ఘటనలో రత్నంపేట, బీబీ పట్నం గ్రామాలకు చెందిన ముగ్గురు పరారీలో ఉన్నారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

120 కిలోల గంజాయి స్వాధీనం

పద్మనాభం (విశాఖపట్నం), జనవరి 5: ఒడిశాలోని చిత్రకొండ నుంచి విశాఖకు తరలిస్తున్న 120 కిలో గంజాయిని పట్టుకున్నట్టు సిటీ టాస్క్‌ఫోర్సు ఏసీపీ త్రినాధరావు చెప్పారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకా రం.. నగర పోలీసు కమిషనరు రవిశంకర్, స్పెషల్ బ్రాంచ్ అడిషనల్ కమిషనరు నాగేంద్రుడు ఆదే శాల మేరకు శుక్రవారం చిన్నాపురం సమీపంలోని లేఅవుట్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేప ట్టగా కారులో తరలిస్తున్న 120 కిలోల గంజాయి లభించింది. దీని విలువ రూ. 6 లక్షల ఉంటుంది. గంజాయితో పాటు రవాణాకు ఉపయోగించిన కారు, బైకు, ఆరు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు కె. గోపాల్, పి. రవిబాబు (అరకు), ఎస్ బోరా (కోరాపుట్), పి. వరప్రసాద్ (హుకుంపేట), జి.రామకృష్ణ (డుంబ్రిగుడ)ను అరెస్టు చేశారు. సీఐ సన్యాసినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్వైవార్షిక నగదు మంజూరులో 1856 మందికి లబ్ధి: కలెక్టర్

అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 5: జిల్లాలో ద్వైవార్షిక నగదు మంజూరు చేసినట్టు కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తెలిపారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా 1856 మందికి రూ.2.64 కోట్లు చెల్లిస్తున్నట్టు చెప్పారు. ఆగస్టు నుంచి డిసెంబరు నెలల మధ్య రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల పథకాల్లో అర్హత ఉండి నిర్దీత సమయంలో దరఖాస్తు చేసుకోలేకపోవడం, బ్యాంక్ ఖాతాల వివరాలు సరిగా లేనివారికి ద్వైవార్షిక నగదులో చెల్లిస్తున్నట్టు తెలిపారు. శుక్రవారం సీఎం జగన్మోహన్‌రెడ్డి తాడేపల్లిలో ద్వైవార్షిక నగదు మంజూరు చేస్తూ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో శంకరంలోని కలెక్టరేట్ నుంచి కలెక్టర్ రవి పట్టన్‌శెట్టితో పాటు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'రాంకీ' ఫార్మా కమర్షియల్ హబ్‌ను సందర్శించిన పంజాబ్ సీఎం

» పారిశ్రామిక అభివృద్ధికి సహకరించాల్సిందిగా విజ్ఞప్తి

పరవాడ, జనవరి 5: తమ రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని 'రాంకీ ఫార్మా' ప్రతినిధులను పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్‌మన్ కోరారు. శుక్రవారం ఆయన అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలో గల రాంకీ ఫార్మాసిటీ కమర్షియల్ హబ్‌ను సందర్శించారు. అనంతరం రాంకీ ప్రతినిధులతో సమావేశమయ్యారు. తమ రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పేందుకే అనువైన ప్రదేశాలు ఉన్నాయని, పారిశ్రామికవేత్తలు తరలివచ్చేలా చూడాలన్నారు. ఇందుకోసం తమ రాష్ట్ర ముఖ్య కార్యదర్శిని పంపిస్తామని, ఆయనతో అన్ని విషయాలు చర్చించాలని కోరారు. ఈ సందర్భంగా ఫార్మా సిటీ ఎండీ లాల్‌కృష్ణ..రాంకీ ద్వారా చేపడుతున్న కార్యకలాపాల గురించి వివరించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ కేవీ మురళీకృష్ణ, జడ్పీటీసీ సభ్యుడు పైలా సన్యాసిరాజు, రాంకీ ప్రతినిధులు రాఘవరెడ్డి, యర్రయ్య తదితరులు పాల్గొన్నారు. తొలుత పంజాబ్ సీఎంకు స్థానిక శాసనసభ్యుడు అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఘన స్వాగతం పలికారు.

'వాల్మీకులు అంటే వైసీపీకి చిన్నచూపు'

విశాఖపట్నం, జనవరి 5: ఏజెన్సీలో ఆదివాసీ వాల్మీకి కులస్తులకు రాజకీయంగా తగిన ప్రాధాన్యత ఇవ్వకపోతే వైసీపీకి వచ్చే ఎన్నికల్లో భంగపాటు తప్పదని ఆదివాసీ వాల్మీకి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రామ్మూర్తి హెచ్చరించారు. శుక్రవారం ఆయన ఎంవీపీ కాలనీలోని గిరిజన్ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. వాల్మీకిలు అంటే వైసీపీకి చిన్నచూపు ఉందన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ సమన్వయకర్తల నియామకం తమను తీవ్ర నిరాశకు గురిచేసిందని చెప్పారు. ఏజెన్సీలో ఉన్న బలమైన సామాజిక వర్గాలు భగత, వాల్మీకి, కొండదొరలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన వారు చింతపల్లి నుంచి దేవూరి కొండలరావు, కోరాబు వెంకటరత్నం, పసుపులేటి బాలరాజు గెలుపొందారని, అరకు నుంచి దుక్కు, సర్వేశ్వరరావు, శెట్టి ఫాల్గుణ ఎన్నికయ్యారని తెలిపారు. ప్రస్తుతం ఎస్టీల ముసుగులో కొందరు బినామీ ప్రజాప్రతినిధులుగా చలామణి అవుతున్నారని ఆరోపించారు. ఆయనతో పాటు ఆ సంఘం నాయకులు రామారావు, సత్యారావు, రామలింగం, పాపారావు ఉన్నారు.

దువ్వాడ మీదుగా సంక్రాంతి ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, జనవరి 5: సంక్రాంతి ప్రయాణికుల సౌకర్యార్థం వయా దువ్వాడ మీదుగా హైదరాబాద్, సికింద్రాబాద్, బ్రహ్మపూర్‌కు ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నట్టు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం ఏకే.త్రిపాఠి తెలిపారు.

హైదరాబాద్-బ్రహ్మపూర్-హైదరాబాద్

07027 నంబరు గల రైలు ఈనెల 13న రాత్రి 10.40 గంటలకు హైదరాబాద్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం 10.25 గంటలకు దువ్వాడ, మధ్యాహ్నం 3.15 గంటలకు బ్రహ్మపూర్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 07028 నంబరు గల రైలు ఈనెల 14న సాయంత్రం 6.00 గంటలకు బ్రహ్మపూర్‌లో బయలుదేరి రాత్రి 11.25 గంటలకు దువ్వాడ, మర్నాడు మధ్యాహ్నం 11.30 గంటలకు హైదరాబాద్ చేరుతుంది.

సికింద్రాబాద్-బ్రహ్మపూర్-సికింద్రాబాద్

07025 నంబరు గల రైలు ఈనెల 12, 19తేదీల్లో రాత్రి 7.45 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం 5.45 గంటలకు దువ్వాడ, 11.15 గంటలకు బ్రహ్మపూర్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 07026 నంబరు గల రైలు మధ్యాహ్నం 12.30 గంటలకు బ్రహ్మపూర్‌లో బ యలుదేరి సాయంత్రం 5.10 గంటలకు దువ్వాడ, మర్నాడు ఉదయం 6.30 గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది.

కిరండోల్ రైళ్లు జగదల్‌పూర్ వరకే...

కేకే లైనులోని దంతెవాడ, కామలూర్ స్టేషన్ల మధ్య భద్రతా నిర్మాణ పనులు చేపడుతున్న నేపథ్యంలో విశాఖ -కిరండోల్ మధ్య రాకపోకలు సాగించే రైళ్లను విశాఖ, జగదల్‌పూర్ మధ్య నడిపించనున్నట్టు సీనియర్ డీసీఎం ఏకే.త్రిపాఠి తెలిపారు. 18514 నంబరు గల నైట్ ఎక్స్‌ప్రెస్, 08551 నంబరు గల డే ఎక్స్‌ప్రెస్ ఈనెల 9వతేదీ విశాఖ నుంచి జగదల్‌పూర్ వరకు....తిరుగు ప్రయాణంలో 18513 నంబరు గల నైట్ ఎక్స్‌ప్రెస్, 08552 నంబరు గల డే ఎక్స్‌ప్రెస్ ఈ నెల 10న జగదల్‌పూర్‌లో బయలుదేరి విశాఖ చేరనున్నట్టు పేర్కొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	70.00
లైవ్ ధర	90.00
విత్ స్కిన్	150.00
స్కిన్ లెస్	160.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	625
విజయనగరం	629
శ్రీకాకుళం	629

నూతన సాంకేతిక పరిజ్ఞానంతో బోధన చేస్తే సత్ఫలితాలు

» కళాశాల విద్యా కమిషనర్ పోలా భాస్కర్

» ఎలమంచిలిలో జోన్ 1 కళాశాలల సమీక్ష సమావేశం

ఎలమంచిలి, జనవరి 5: కళాశాలల్లో కొత్త కోర్సులను ప్రవేశపెడుతూ నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి బోధన చేసినప్పుడు సత్ఫలితాలు సాధించవచ్చునని రాష్ట్ర కళాశాల విద్యా కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ అన్నారు. శుక్రవారం ఎలమంచిలిలోని గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జోన్-1 కళాశాలల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎలమంచిలి డిగ్రీ కళాశాలలో మౌలిక వసతుల కల్పనకు దాతల సహకారాన్ని తీసుకొని నాక్ ఏ గ్రేడును సాధించడమే కాకుండా స్వతంత్ర ప్రతిపత్తి పొందడం గొప్ప విషయమన్నారు. ఆదర్శవంతంగా నిలిచిన కళాశాల అధ్యాపక బృందాన్ని ఆయన అభినందించారు. సమిష్టిగా ఉంటూ కళాశాలను తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. అనంతరం కళాశాలలో మౌలిక సదుపాయాలు, విద్యార్థులకు ఉపయోగపడేలా ఉన్న కళాశాల పరిసరాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించే విభాగాలు, జిమ్ తదితర విభాగాలను బృంద సభ్యులంతా పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులంతా పోలా భాస్కర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సమావేశానికి ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాలకు చెందిన 40 ప్రభుత్వ, 3 ఎయిడెడ్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, కళాశాలల అంతర్గత నైపుణ్యాల మదింపు సంస్థల అధికారులు ఏజీఓ తులసి మస్తానమ్మ, జోన్ వన్ ఆర్‌జేడీ శోభా హాజరయ్యారు.



రాష్ట్ర కళాశాల విద్యా కమిషనర్ పోలా భాస్కర్‌ను సత్కరిస్తున్న కళాశాల అధ్యాపకులు

భువనేశ్వరిని కలిసిన రత్నాకర్ దంపతులు

అనకాపల్లి టౌన్, జనవరి 5 : తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరిని శుక్రవారం గాజువాకలో తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు దాడి రత్నాకర్, అచ్యుత దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. చంద్రబాబునాయుడు అరెస్టు అయినప్పుడు మనోవేదనతో మృతి చెందిన కార్యకర్తల కుటుంబాలను పరామర్శించేందుకు వచ్చిన భువనేశ్వరిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెతో పలు అంశాలపై చర్చించినట్టు ఆయన కార్యాలయ వర్గాలు తెలిపాయి.



భువనేశ్వరితో మాట్లాడుతున్న రత్నాకర్ దంపతులు

జగన్ అధికారంలోకి వచ్చాక దళితులపై దాడులు పెరిగాయి

» మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పెంటారావు

» ప్రభుత్వం వ్యతిరేక చర్యలను నిరసిస్తూ త్వరలో భవిష్యత్ కార్యాచరణ

నర్సీపట్నం, జనవరి 5 : రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులపై దాడులు, దౌర్జన్యాలు పెరిగాయని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పాల్తేరు పెంటారావు ఆరోపించారు. శుక్రవారం ఇక్కడ జరిగిన దళిత సంఘాల జిల్లా నాయకుల సమావేశంలో మాట్లాడారు. జాతీయ కారాగార గణాంకాల ప్రకారం రాష్ట్రంలో 41.16 శాతం దాడులు, దౌర్జన్యాలు, మహిళలపై అత్యాచారాలు పెరిగాయని 2023 నివేదిక వెల్లడించిందంటే దళితుల పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చునని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత 28 రకాల సంక్షేమ పథకాలను రద్దు చేసిందని విమర్శించారు. దళితుల భూములు ఆక్రమణకు గురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో దళిత వ్యతిరేక చర్యలను ఎత్తిచూపుతూ త్వరలో భవిష్యత్ కార్యాచరణ చేపడతామన్నారు. ఈ సమావేశంలో నాయకులు నేత నాగేశ్వరరావు, గాతాడ సహదేవుడు, యర్రంశెట్టి పాపారావు పాల్గొన్నారు.



సమావేశంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పెంటారావు

పంచాయతీ కార్మికుల వేతన బకాయిలను చెల్లించాలి

» సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న పంచాయతీ కార్మికులు

అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 5: పంచాయతీ కార్మికుల వేతన బకాయిలను తక్షణమే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట పంచాయతీ కార్మికుల వేతన బకాయిలు చెల్లించాలని ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండగ పూట కూడా పంచాయతీ కార్మికులను పస్తులు పెట్టడం వైసీపీ ప్రభుత్వానికి పరిపాటిగా మారిందన్నారు. కొన్ని పంచాయతీల్లో మూడు నుంచి 13 నెలలుగా గ్రీన్ అంబాసిడర్‌లకు వేతనాలు ప్రభుత్వం చెల్లించలేదన్నారు. తక్షణమే ప్రభుత్వం పంచాయతీ కార్మికుల బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

సింహాద్రి మొదటి యూనిట్ ఉత్పత్తి పునరుద్ధరణ

పరవాడ, జనవరి 5: సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎన్టీపీసీ)లో 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మొదటి యూనిట్‌లో ఉత్పత్తిని శుక్రవారం రాత్రి అధికారులు పునరుద్ధరించారు. వార్షిక నిర్వహణ పనుల నిమిత్తం గతేడాది నవంబరులో ఈయూనిట్‌ను షట్‌డౌన్ చేసిన సంగతి తెలిసిందే. నిర్వహణ పనులు పూర్తి చేసి శుక్రవారం యూనిట్‌లో ఉత్పత్తిని ప్రారంభించారు. శనివారం ఉదయానికి యూనిట్‌లో పూర్తి స్థాయి ఉత్పత్తి జరుగుతుందని అధికారులు తెలిపారు. మిగతా రెండు, మూడు, నాలుగు యూనిట్‌ల్లో ఉత్పత్తి యథావిధిగా కొనసాగుతుందన్నారు.

మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా అనకాపల్లి

» కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి, జనవరి 5 (అనకాపల్లి): మాదకద్రవ్యాల రహిత జిల్లాగా చేయాలని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్పీ కేవీ మురళీకృష్ణతో కలిసి డిస్ట్రిక్ట్ లెవెల్ నార్కో కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా సంబంధిత శాఖల సమన్వయంతో డబ్బు, మద్యం, ఉచిత కానుకలు, మాదక ద్రవ్యాల కట్టడికి కృషిచేయాలని సూచించారు. ఎన్‌సీఓఆర్‌డీ కమిటీ ఆధ్వర్యంలో అన్ని శాఖల సమన్వయంతో పనిచేసి మాదక ద్రవ్యాల నివారణకు పోలీసు శాఖతో కలిసి పనిచేయాలన్నారు. జిల్లా ఎస్పీ కేవీ.మురళీకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర శాఖల సమన్వయంతో పని చేసి మాదకద్రవ్యాల సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవడం ద్వారా అడ్డుకట్ట వేయాలన్నారు. రానున్న ఎన్నికలు నేపథ్యంలో మరింత సమర్థవంతంగా పని చేసి గంజాయి రవాణాను అన్ని శాఖల సహకారంతో అడ్డుకట్ట వేస్తామన్నారు. తరచూ గంజాయి రవాణా నేరాలకు పాల్పడుతున్న నిందితులపై కఠిన చర్యల్లో భాగంగా 27 మందిని గుర్తించామన్నారు. వీరిలో ఏడుగురిపై పీడీ యాక్ట్ నమోదు చేశామన్నారు. నేరాలకు పాల్పడుతున్న నిందితులు ఉంటున్న 63 గ్రామాలను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటుచేశామని, 241 మందిపై హిస్టరీ షీట్‌లను తెరవడం జరిగిందన్నారు. సమావేశంలో జేసీ ఎం.జాహ్నవి, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ ఆర్ఎస్‌వీ.ప్రసాద్, ఏఎస్పీలె బి.విజయభాస్కర్, అధిరాజ్‌సింగ్ రాణా, కోస్టుగార్డ్ కమాండెంట్ గోవింద్ సరేన్, నర్సీపట్నం ఆర్డీఓ జయరాం, డీఎంహెచ్‌ఓ హేమంత్, అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ వి.సుబ్బరాజు, డీఆర్‌ఓ దయానిధి, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, పక్కన ఎస్పీ మురళీకృష్ణ

విలేకరుల ఇళ్ల స్థలాల ప్రక్రియ వేగవంతం చేయాలి

అనకాపల్లి రూరల్: జిల్లాలో అర్హులైన విలేకరులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టర్ చాంబర్‌లో జరిగిన జర్నలిస్టుల హౌసింగ్ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలను అనుసరించి విలేకరుల ఇళ్ల స్థలాలకు ప్రభుత్వ భూమిని గుర్తించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ పత్రికల విలేకరులు పాల్గొన్నారు.

ఆంజనేయ వాహనంపై ఆపద్బాంధవుడు

నక్కపల్లి, జనవరి 5: ఉపమాక క్షేత్రంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉపమాక వెంకన్న తిరువీధి సేవ ఘనంగా జరిగింది. ముందుగా కొండపైన, కింద ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు చేసి, ధూప, దీప, నైవేద్య నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించి, బాలభోగ, రాజభోగ నివేదన చేశారు. అనంతరం ఆంజనేయ వాహనంపై స్వామివారిని, పల్లకీలో గోదాదేవి అమ్మవారిని అలంకరించి మాడవీధుల్లో ఊరేగించారు. తదుపరి గోదాదేవి అమ్మవారి సన్నిధి వద్ద తిరుప్పావై పాశుర విన్నపం చేశారు.



స్వామివారి తిరువీధి సేవ

గిరి ప్రదక్షిణోత్సవానికి ఏర్పాట్లు చేయండి

నక్కపల్లి, జనవరి 5: కనుమ పండుగ రోజున ఉపమాకలో జరగనున్న గరుడాద్రి పర్వతం చుట్టూ జరిగే స్వామివారి గిరి ప్రదక్షిణోత్సవానికి ఏర్పాట్లు సకాలంలో చేపట్టాలని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ కోరారు. శుక్రవారం ఉపమాక ఆలయానికి వెళ్లి ఆలయ అధికారులతో ఆయన మాట్లాడారు. గిరి ప్రదక్షిణోత్సవానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకో వాలని కోరారు. కొండ చుట్టూ ఉన్న మార్గంలో తుప్పలు తొలగించాలన్నారు. ఆయన వెంట వైసీపీ నాయకులు వున్నారు.

మద్యం మత్తులో కేజీహెచ్‌లో స్వీపర్ అరాచకం

విశాఖపట్నం, జనవరి 5: కేజీహెచ్‌లో స్వీపర్ మద్యం మత్తులో రోగి వెంట వచ్చిన సహాయకురాలి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఆస్పత్రిలోని భవనగర్ వార్డులో చికిత్స పొందుతున్న రోగికి సహాయంగా కుటుంబ సభ్యురాలు వచ్చారు. గురువారం రాత్రి నిద్రిస్తున్న ఆమెను ఆస్పత్రి స్వీపర్ ధనాల వాసు మద్యం మత్తులో వెనుక నుంచి గట్టిగా కొరికాడు. దీంతో ఆమె లేచి కేకలు వేసింది. శరీరంపై పంటి గాట్లు పడడంతో సిబ్బంది వెంటనే చికిత్స అందించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది.

సమస్యలు పరిష్కరించమంటే విధుల నుంచి తొలగిస్తారా..?

» సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

పాడేరు రూరల్, జనవరి 5: సమస్యలు పరిష్కరించాలని కోరితే విధుల్లో తొలగిస్తారా? అని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.అనిల్‌కుమార్, వి.జయరాజ్ మండిపడ్డారు. సమ్మెలో భాగంగా శుక్రవారం వారు మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో విద్యా రంగం అభివృద్ధికి కృషి చేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగుల్లో భాగమైన కేజీబీవీ ఉపాధ్యాయులను విధుల నుంచి తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం విచారకమన్నారు. ప్రభుత్వం ఎన్ని బెదిరింపులకు దిగినా సమ్మెను విరమించేది లేదని వారు స్పష్టం చేశారు. పదో తరగతి పరీక్షలకు ముందు సమ్మెకు దిగడం న్యాయం కాదంటున్న అధికారులకు, నాలుగేళ్లగా తాము చేస్తున్న పోరాటం కనిపించలేదా? అని ప్రశ్నించారు. శుక్రవారం సమ్మెకు టీఎస్ టీయూసీ నాయకురాలు ఎం.మణి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి.రాజారావు, ఎస్.గంగరాజు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగ సంఘ నేత పి.సింహాచలం, అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు: ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

చింతపల్లి, డిసెంబరు 5: గిరిజన గ్రామాల్లో అర్హులందరికీ ప్రభుత్వం పింఛన్లు పంపిణీ చేస్తున్నదని ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికీ పింఛన్ అందని లబ్ధిదారులు గ్రామ సచివాలయం వద్దకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నెరవేర్చుతూ మూడు వేల పింఛన్ పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆశాజ్యోతి, ఎంపీపీ కోరాబు అనుషదేవి, జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, సర్పంచ్ దురియా పుష్పలత, ఎంపీ టీసీ సభ్యులు ధారమల్లేశ్వరి పద్మ, జయలక్ష్మి, నియోజకవర్గం సమన్వయ కర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు పాల్గొన్నారు.

130 మందికి వైద్య పరీక్షలు

చింతపల్లి, జనవరి 5: మండలంలోని అంజలిశని వారం పంచాయతీ కేంద్రంలో 130 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. శుక్రవారం ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో తాజంగి వైద్యాధికారి జి. భవానీ, ప్రత్యేక వైద్యనిపుణులు అశోక్, అజయ్ కుమార్ రోగులకు వైద్య పరీక్షలు చేశారు. 21 మంది దీర్ఘకాల రోగులను మైదాన ప్రాంతాలకు పంపించారు. కార్యక్రమంలో సర్పంచ్ పేట్ల రాజుబాబు, మినీ గురుకులం కళాశాల ప్రిన్సిపాల్ కె.బృందావాణి తదితరులు పాల్గొన్నారు.

అచ్చెంనాయుడును కలిసిన సుబ్బారావు



పాడేరు రూరల్, జనవరి 5: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెంనాయుడును పార్టీ పాడేరు నేత కొట్టగుళ్లి సుబ్బారావు మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం కలిసి యువతకు అవకాశం కల్పించాలని కోరినట్టు సుబ్బారావు చెప్పారు. ఈ విషయాన్ని అధిష్ఠానం దృష్టికి తీసుకువెళ్తానని అచ్చెంనాయుడు చెప్పారన్నారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యం

» టీడీపీ అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి దొన్నుదొర

అరకులోయ, జనవరి 5: రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందాలంటే విజనరీ నేత చందరబాబుతోనే సాధ్యమని టీడీపీ అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర అన్నారు. మండలంలోని మాడగడ పంచాయతీ చంపగుడ గ్రామంలో శుక్రవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలతో కలిసి ఇంటింట ప్రచారం చేపట్టారు. టీడీపీ ప్రకటించిన మినీ మేనిఫెస్టోను ప్ల కార్డులతో ప్రదర్శించారు. ఈ మేనిఫెస్టోతో ఇంటిల్లపాదికి సంక్షేమ పథకాలు ఎలా ప్రయోజనకరమో వివరించారు. అనంతరం దొన్నుదొర మాట్లాడుతూ రాష్ట్రంలో వచ్చేది తెలుగుదేశం-జనసేన కూటమే అన్నారు. చంద్రబాబుతో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, అదే జగన్‌తోనైతే అప్పుల భారం మరింత పెరుగుతుంది తప్ప రాష్ట్రానికి ఎటువంటి ప్రయోజనం లేదని పేర్కొన్నారు. ఇప్పటినుంచే వైసీపీ అధినేత, సీఎం జగన్‌కు ఓటమి భయం పట్టుకుందని, అందుకే కొత్త డ్రామాలకు తెర తీస్తున్నారని ఆరోపించారు. నాడు కోడికత్తి, బాబాయ్ హత్యతో జనాల్ని తప్పుదోవ పట్టించిన జగన్, నేడు ఇంట్లో చిచ్చుపెడుతున్నారని మరో డ్రామా మొదలు పెట్టారని ఆరోపించారు. ఎన్నికల్లో తల్లీచెల్లి సేవలను ఉపయోగించుకుని, అధికారంలోకి వచ్చాక వారిని ఏ విధంగా బయటకు పంపారో రాష్ట్ర ప్రజలకు తెలుసునన్నారు. వాస్తవ పరిస్థితులను పక్కదోవ పట్టించేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసినా, ప్రజలంతా జనసేన-తెదేపా కూటమిని గెలిపించడం ఖాయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పెదలబుడు సర్పంచ్ దాసుబాబు, నాయకులు వంతల రాము, కిల్లో కుమార్, త్రినాథ్, సుబ్బారావు, వెంకట్రావు, బీమన్న కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



చంపగుడలో మినీ మేనిఫెస్టోను ప్ల కార్డులతో ప్రదర్శిస్తున్న దొన్నుదొర, గిరిజనులు



కినపర్తిలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు

మోసకారి జగన్‌ను సాగనంపాలి: దొరబాబు

కొయ్యూరు, జనవరి 5: మాయమాటలతో ప్రజలను మోసగిస్తూ పాలన సాగిస్తున్న జగన్మోహనరెడ్డిని సాగనంపాలని, భవిష్యత్తుకు బంగారుబాట వేసే చంద్రబాబును ఎన్నుకోవాలని టీడీపీ మండల కార్యదర్శి తోట దొరబాబు సూచించారు. కినపర్తి, రత్నంపేట పంచాయతీలలో శుక్రవారం 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారంటీ' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందాలన్నా, గిరిజనులు ఆర్థికాభివృద్ధితో ముందడుగు వేయాలన్నా రానున్న ఎన్నికల్లో టీడీపీని అందలమెక్కించాలన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పాలన సాగించడం చంద్రబాబుకే సాధ్యమని పేర్కొన్నారు. ప్రజలు ఏకతాటిపైకి వచ్చి టీడీపీ గెలుపునకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పొత్తూరు దేముడు, కొంతిలి వెంకటప్రసాద్, స్వామినాయుడు, లోతా సింహాచలం, పాంగి భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

బెదిరింపులు మానండి.. సమస్యలు పరిష్కరించండి

» బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాంగి రాజారావు

» కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె

» పాడేరు ఐటీడీఏ ఎదుట నిరసన శిబిరం

పాడేరు రూరల్, జనవరి 5: అంగన్‌వాడీలను బెదిరించడం మానుకుని సమస్యలు పరిష్కరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాంగి రాజారావు డిమాండ్ చేశారు. మన్యంలో అంగన్‌వాడీల సమ్మె కొనసాగుతోంది. పాడేరు ఐటీడీఏ ఎదుట నిరసన శిబిరంలో రాజారావు కూర్చొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అడుగుజాడల్లో నడుచుకుంటున్న అధికారులు 5వ తేదీ నుంచి విధుల్లోకి చేరకుంటే ఉద్యోగం నుంచి తొలగిస్తామంటూ అంగన్‌వాడీలకు హెచ్చరిక నోటీసులు జారీ చేయడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తీరు మార్చుకొని వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ సమస్యలు పరిష్కంచేవరకు సమ్మెను ఆపే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.అనంతరం విధుల్లో చేరకుంటే ఉద్యోగాల నుంచి తొలగిస్తామంటూ కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వు కాపీని శిబిరం వద్ద దహనం చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు చిన్నారి, దేవి, అంబిక, విజయ, జయ, అధిక సంఖ్యలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు.





చింతపల్లిలో ధింసా నృత్యం చేస్తూ అంగన్‌వాడీల నిరసన... ముంచంగిపుట్టులో దీక్షా శిబిరంలో కూర్చొన్న కాంగ్రెస్ నేతలు

వద్దు వద్దు జగనన్న.. మీ పాలన మాకొద్దు..

చింతపల్లి: 'వద్దు వద్దు జగనన్న.. మీ పాలన మాకొద్దు' అంటూ చింతపల్లిలో అంగన్‌వాడీలు నృత్యం చేసి నిరసన తెలిపారు. చంద్రబాబు పాలన రాష్ట్రం, దేశం గర్వించిందనే పాటకు ధింసా నృత్యం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నేత పెంటమ్మ మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రతిపక్ష నేత హోదాలో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు జగన్ వెనుకంజ వేయడం దారుణమన్నారు. రోజులు గుస్తున్నా సమస్యల పరిష్కారానికి కనీస చర్యలు తీసుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా స్పందించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చఇంచారు. కార్యక్రమంలో వర్కర్స్ యూనియన్ నాయకులు రాములమ్మ,అక్కమ్మ, లక్ష్మి, రాజేశ్వరి, సత్యవతి, నీలమ్మ, టీడీపీ నాయకుడు రీమల ఆనందరావు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టులో...

ముంచంగిపుట్టు: అంగన్‌వాడీల సమ్మె శుక్రవారం 25వ రోజుకు చేరుకుంది. జగన్ ఎన్నికల ప్రచారం సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని చేపట్టిన దీక్షకు కాగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు వి.నీలకంఠం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలను పట్టించుకోపోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీల న్యాయమైన పోరాటానికి కాంగ్రెస్ పార్టీ పూర్తి స్థాయిలో మద్దతు అందిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, సీఐటీయూ, గిరిజన సంఘం నాయకులు రామదాసు, సత్యవతి, ఈశ్వరమ్మ, భవానీ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులతో కలిసి నమూనా చెక్కును ప్రదర్శిస్తున్న జేసీ

2,608 మందికి నవరత్నాలు లబ్ధి

» పెండింగ్ లబ్ధిదారుల ఖాతాల్లో రూ.2.79 కోట్ల జమ: జేసీ కె.కార్తీక్

పాడేరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ కారణాలతో పెండింగ్‌లో వున్న 2,608 మంది నవరత్నాల లబ్ధిదారుల ఖాతాలో శుక్రవారం రూ.2.79 కోట్లు జమ చేసినట్టు జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ తెలిపారు. అర్హత కలిగినా సొమ్ము పడని నవరత్నాల లబ్ధిదారుల కోసం శుక్రవారం సీఎం జగన్ బటన్ నొక్కుడు కార్యక్రమం సందర్భంగా కలెక్టరేట్‌లో జేసీ మాట్లాడారు. అర్హులైన నవరత్నాల పెండింగ్ లబ్ధిదారుల కోసం ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహించిందని, వారి ఖాతాలో సొమ్ము జమ చేసిందని చెప్పారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని లబ్ధిపొందాలని జేసీ కోరారు. అనంతరం లబ్ధిదారులతో కలిసి జమైన సొమ్ముకు సంబంధించిన నమూనా చెక్కును ప్రదర్శించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వి.మురళీ, సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్య శిక్షణతో మెరుగైన ఉపాధి

» ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్



అభ్యర్థులకు ధ్రువపత్రాలను అందిస్తున్న శ్రీనివాస్, తదితరులు

పాడేరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): వృత్తి నైపుణ్య శిక్షణతో మెరుగైన స్వయం ఉపాధి పొందవచ్చని మినిస్ట్రీ ఆఫ్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైనర్ (ఎంఎస్ఎంఈ) అసిస్టెంట్ డైరెక్టర్ ఎ.శ్రీనివాస్ చెప్పారు. మండలంలోని మినుములూరులో ఎంఎస్ఎంఈ సహకారంతో చైతన్య స్రవంతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గార్మెంట్ తయారీపై నిర్వహించిన వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ శిక్షణ ద్వారా మహిళలు ఐక్యంగా దుస్తుల తయారీ పరిశ్రమలను ఏర్పాటు చేసుకుని చక్కని స్వయం ఉపాధి పొందవచ్చునన్నారు. ఇటువంటి శిక్షణలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఎంఎస్ఎంఈ ఏడీ శ్రీనివాస్, సంస్థ డైరెక్టర్ మాలినీ, తదితరులు ధ్రువపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో చైతన్య స్రవంతి సంస్థ కోఆర్డినేటర్ రాజ్‌కుమార్, మాస్టర్ ట్రైనర్ సన్యాసమ్మ, సిబ్బంది, యువతులు పాల్గొన్నారు.

ఓపెన్ యూనివర్సిటీ పరీక్ష ఫీజు చెల్లించాలి

పాడేరు రూరల్, జనవరి 5: ఓపెన్ యూనివర్సిటీ విద్యార్థులు ఈ నెల 15వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో ;రీక్ష ఫీజులు చెల్లించాలని కళాశాల ప్రిన్సిపాల్ వనుము చిట్టబ్బాయి ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రం 128 ప్రభుత్వ డిగ్రీ కళాశాల పాడేరులో 2017 సంవత్సరం నుంచి 2022 వరకు అడ్మిషన్‌లు పొందిన విద్యార్థులు, గత ఏడాది నవంబరు నెలలో ట్యూషన్ ఫీజులు చెల్లించిన వారు సెమిస్టర్ 2, 5 పరీక్ష ఫీజులను ఈ నెల 15వ తేదీలోగా ఆన్‌లైన్‌లో చెల్లించి డౌన్‌లోడ్ చేసిన అప్లికేషన్‌ను అధ్యయన కేంద్రం కో-ఆర్డినేటర్ ఎ.మురళీధరరావుకు అందించాలన్నారు. పూర్తి వివరాల కోసం అధ్యయన కేంద్రం 9490458695, 7382929728, 9494372020 సెల్ నంబరుకు సంప్రదించాలని ఆయన కోరారు.

గిరి యువత ఉన్నత ఉద్యోగాలు సాధించాలి

» ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అభిషేక్

అరకులోయ, జనవరి 5: గిరిజన యువత ఉన్నత స్థాయి ఉద్యోగాలు సాధించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ సూచించారు. మండల కేంద్రంలోని గిరిజన్ భవన్‌లో ఆదివాసీ గిరిజన సంఘం నేతలు అప్పలనర్స, సురేంద్ర, బాలదేవ్ తదితరుల ఆధ్వర్యంలో శుక్రవారం గిరిజన యువతీ, యవకులకు గ్రూపు-2 స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ గిరిజన సంఘం సమకూర్చిన స్టడీ మెటీరియల్‌ను గ్రూపు-2 పరీక్షలకు సన్నద్ధమవుతున్న యువతీ, యవకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తద్వారా పోటీ పరీక్షల్లో విజయం సాధించి అందరికీ ఆదర్శంగా నిలవాలని సూచించారు. నమ్మకం, పట్టుదలతో చదివి పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేవారు తప్పకుండా విజయం సాధిస్తారని పేర్కొన్నారు.

అత్యున్నత ఫలితాలు సాధించి మరింత మంది గిరిజన యువతకు మార్గదర్శకంగా నిలవాలని ఆయన సూచించారు. పరీక్షలకు సిద్ధపడుతున్న అభ్యర్థులకు ఏపీ గిరిజన సంఘం ప్రతినిధులు ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను అందించారు.



అభ్యర్థులకు గ్రూప్-2 స్టడీ మెటీరియల్ అందిస్తున్న పీవో అభిషేక్

వీరిని పీవో అభిషేక్, గిరిజన సంఘం ప్రతినిధులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు అప్పలనర్స, గిరిజన సంఘం కార్యదర్శి కిల్లో సురేంద్ర, జిల్లా కార్యదర్శి బాలదేవ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల ఆందోళన

ముంచంగిపుట్టు, జనవరి 5: మండల పరిధిలో వివిధ పాఠశాలల్లో పని చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు శుక్రవారం ఆందోళనకు దిగారు. సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ సీఐటీయూ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంఈవో క్రిష్ణమూర్తికి వినతిపత్రాన్ని అందించారు. అనంతరం సీఐటీయూ మండల నాయకుడు కె.త్రినాథ్ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని వేడుకుంటున్నా ఎవరూ స్పందించకపోవడం విచాకరమని వాపోయారు. ఎన్నికల సమయంలో మధ్యాహ్న భోజన కార్మికులకు జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని, బకాయిలు అందించాలని, ప్రతీ నెల 5వ తేదీలోపు వేతనాలతో పాటు బిల్లులు చెల్లించాలని, ప్రభుత్వమే గ్యాస్ సరఫరా చేయాలని, ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పి.సత్యనారాయణ, కార్మికులు పాల్గొన్నారు.



ఎంఈవో కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న కార్మికులు, నాయకులు

కాగితాలకే చోడవరం అభివృద్ధి పరిమితం

» ఎమ్మెల్యే ధర్మశ్రీ ప్రకటనలపై తాతయ్యబాబు ఆగ్రహం

» వైసీపీ పాలనలో వైఫల్యాల చిట్టా విప్పిన టీడీపీ నేత

బుచ్చెయ్యపేట, జనవరి 5 : చోడవరం నియోజకవర్గ అభివృద్ధి కాగితాలకే పరిమితమైందని, ఇందుకు ఎమ్మెల్యేగా ఉన్న కరణం ధర్మశ్రీ అసమర్థతే కారణమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు ఆరోపించారు. శుక్రవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ధర్మశ్రీ అసమర్థత వల్ల రెండేళ్లుగా బీఎన్ రోడ్డు అభివృద్ధి పనులు సాగుతున్నాయని ఎద్దేవా చేశారు. బీఎన్ రోడ్డు పనులను 2023 డిసెంబరు నెలాఖరులోగా పూర్తిచేస్తామని సాక్షాత్తు వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే ధర్మశ్రీ సంయుక్తంగా చేసిన ప్రకటన మోసపూరితంగానే మిగిలిందన్నారు. కాగా నేడు ధర్మశ్రీ బీఎన్ రోడ్డు అభివృద్ధి పనుల పూర్తిపై మరోమారు ప్రకటన చేయడం తగదని ఆయన మండిపడ్డారు. ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటన ఏదని ప్రశ్నించారు. యువతకు ఉపాధి కల్పన నిమిత్తం నియోజకవర్గానికి హబ్‌గా గుర్తింపు తీసుకొస్తామని ధర్మశ్రీ ప్రకటన చేయడం సిగ్గుచేటుగా పేర్కొన్నారు. గోవాడ షుగర్ ఫ్యాక్టరీకి చెరకు రైతుల బకాయిల చెల్లింపు నిమిత్తం ప్రభుత్వం నుంచి రూ.12.5 కోట్లు గ్రాంటు మంజూరు చేయించానని మూడు నెలలుగా ధర్మశ్రీ చెప్పుకొస్తున్నారన్నారు. కానీ నేటికీ చెరకు రైతుల అకౌంట్‌లలో నగదు ఎందుకు జమ కాలేదో సమాధానం చెప్పాలని నిలదీశారు. వడ్డాది వంతెన దెబ్బతిని 22 నెలలు కావస్తున్నా నూతన వంతెన ఊసే లేకుండా పోయిందన్నారు. ఇలా అన్నిరంగాల్లో ధర్మశ్రీ విఫలమయ్యారని తాతయ్యబాబు ఆరోపించారు. వీటన్నింటినీ గమనిస్తున్న ప్రజలు రానున్న ఎన్నికల్లో వైసీపీకి ఓటుతో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

పోలవరం గ్రామసభ వాయిదా

» ఫోన్‌లో నిర్వాసితులతో మాట్లాడిన జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

కూనవరం, జనవరి 5: నిరసనల మధ్య పోలవరం గ్రామసభ వాయిదాపడింది. కూనవరం, టేకులబోరు గ్రామానికి పోలవరం అవార్డు ఎంక్వైరీ గ్రామసభను అధికారులు గురువారం నుంచి నిర్వహిస్తున్నారు. అయితే తమకు ఎంతపరిహారం ఇస్తారో తెలపకుండా ఖాళీపేపర్లపై సంతకాలు చేయించుకుంటున్నారంటూ ఈ సభ మాకు వద్దంటూ పోలవరం నిర్వాసితులు గత రెండురోజులుగా నిరసనలు తెలుపుతున్నారు. అధికారులు మాత్రం నిర్వాసితుల సమస్యలు పట్టించుకోకుండా రెండురోజులుగా సభను కొనసాగిస్తూనే ఉన్నారు. దీంతో శుక్రవారం విసుగుచెందిన పోలవరం నిర్వాసితులు నేరుగా అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఫోన్‌ద్వారా ఈ సమాచారాన్ని వివరించారు. ఫోన్‌లో నిర్వాసితుల సమస్య విన్న కలెక్టర్ నిర్వాసితులకు ఎంత సొమ్ము వస్తుందో ఇంటి వాల్యూ లెక్కలు వేశాకే సభను నిర్వహిస్తామని కలెక్టర్ నేరుగా ఫోన్‌లో నిర్వాసితులకు తెలిపారు. అనంతరం గ్రామసభను వాయిదా వేయాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు.

పార్టీ అండగా ఉంటుంది

... 5వ పేజీ తరువాయి

చిత్ర పటానికి నివాళులర్పించారు. ఆయన భార్య పార్వతిదేవి, కుమారులు వెంకట్రావు, ప్రభాకర్, సుధాకర్‌లను పరామర్శించిన ఆమె అండగా తామున్నామంటూ ధైర్యాన్నిచ్చారు. కష్టకాలంలో తమ కుటుంబానికి అండగా నిలవడంతో పాటు టీడీపీ అభివృద్ధికి అహర్నిశలూ శ్రమిస్తున్న నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు తాము అన్ని వేళలా అండగా నిలుస్తామన్నారు. రాధాకృష్ణ కుటుంబానికి రూ.3 లక్షల చెక్‌ను అందజేశారు. ఇదిలావుండగా పాతగాజువాకలో నారా భువనేశ్వరికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు నేతృత్వంలో నాయకులు ఘన స్వాగతం పలికారు. భువనేశ్వరి వెంట ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, పంచుమర్తి అనురాధ, తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత, పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, నజీర్, చిక్కాల విజయ్, అనంతలక్ష్మి, కార్పొరేటర్‌లు పల్లా శ్రీనివాసరావు, గంధం శ్రీనివాసరావు, పులి లక్ష్మిబాయి, నాయకులు నల్లూరు సూర్యనారాయణ, పులి వెంకటరమణారెడ్డి, తదితరులు ఉన్నారు.

సంక్షిప్తంగా..

'జీసీసీ కాఫీ అవుట్‌లెట్‌ను కొనసాగించండి'

పాడేరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ ఆవరణలో జీసీసీ కాఫీ అవుట్‌లెట్‌ను కొనసాగించాలని జాతీయ ఆదివాసీల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు గడుతూరి రామ్‌గోపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జీసీసీ కాఫీ ప్రమోషన్‌తో పాటు ఐటీడీఏ కార్యాలయానికి వచ్చే వారి సౌకర్యార్థం ఏర్పాటు చేసిన కాఫీ అవుట్‌లెట్‌ను తొలగించేందుకు అధికారులు ప్రయత్నాలు చేయడం తదగన్నారు. ప్రభుత్వం రంగ సంస్థ జీసీసీకి చెందిన కాఫీ అవుట్‌లెట్‌కు ఐటీడీఏ అధికారులే అడ్డంకులు సృష్టించడం సరికాదన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కాఫీ అవుట్‌లెట్‌ను అక్కడే కొనసాగించాలని, అనవసర కారణాలను చూపుతూ తొలగిస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు.

పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడిగా వెంపాటి తలుపులు



తలుపులు

కొయ్యూరు, జనవరి 5: పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడిగా వెంపాటి తలుపులు ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో ఎన్నికల అధికారి కుంచే మురళీ ఆధ్వర్యంలో శుక్రవారం మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పి.బాలారం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు తలుపులను అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా గేరా పంతులు, అసోసియేట్ అధ్యక్షుడిగా నేతల నారాయణ, ఉపాధ్యక్షుడిగా ఈదల సతీష్, మహిళా ఉపాధ్యక్షురాలిగా సుభద్రమ్మతో పాటు మరో ముగ్గురు కార్యదర్శులు, నలుగురు సభ్యులతో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు తలుపులు తెలిపారు.

జనసేన బలోపేతానికి నడుంబిగించాలి

కొయ్యూరు, జనవరి 5: ఎన్నికలు సమీపిస్తున్నందున గ్రామ స్థాయిలో జనసేనను మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు నడుంబిగించాలని జనసేన నియోజకవర్గ కార్యదర్శి ఉల్లి సీతారాం పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు గూడెం లక్ష్మణ్‌చ బూత్ కన్వీనర్ సాగిన బుజ్జిబాబు అధ్యక్షతన జరిగిన పార్టీ శ్రేణుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ బలోపేతానికి నాయకులు గ్రామ స్థాయిలో పర్యటనలకు సిద్ధం కావాలన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో జనసేన పార్టీ విజయవంతమే లక్ష్యంగా మండలంలోని 33 పంచాయతీ శ్రేణులు పనిచేయాలని కోరారు అలాగే పని విభజన చేసుకుని సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాగిన బుజ్జిబాబు, సూర్యప్రకాష్, సుధీర్, రామ్‌ప్రసాద్, నవీన్, రాజు పాల్గొన్నారు.

కంతారంలో పశు వైద్య శిబిరం

కొయ్యూరు, జనవరి 5: రేవళ్ల పంచాయతీ పరిధిలోని కంతారం గ్రామంలో శుక్రవారం పశు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. పశు వైద్యాధికారి కె.రాజేష్ పశువులతో పాటు గొర్రెలు, మేకలు, కోళ్లకు వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో రాంకీ ఫౌండేషన్ ప్రతినిధి హరికృష్ణ వైద్య సేవలు పొందిన పశువులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా సుమారు 150 పశువులకు వాక్సిన్ వేశారు.

8న మాచ్‌ఖండ్‌లో ఉద్యోగుల గ్రామసభ

ముంచంగిపుట్టు, జనవరి 5: ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ ప్రాజెక్టు ఉద్యోగ సమస్యలపై చర్చించేందుకు గ్రామ సభ నిర్వహిస్తామని మత్స్యగెడ్డ ముంపు గ్రామాల నిరుద్యోగ యువత, బిర్సాముండా అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధక్షులు వి.శేషాద్రి, ఎస్.మదన్ శుక్రవారం ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు నిర్వహించే గ్రామసభకు మండల పరిధిలోని ఎంపీపీతో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. ఇరు రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ప్రాజెక్టులో పలు రకాల ఉద్యోగ సమస్యలపై సభలో చర్చిస్తామని చెప్పారు.

అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి: సీఐ రమేష్

జి.మాడుగుల, జనవరి 5: అసంఘిక కార్యకలాపాలకు ప్రజలు దూరంగా జీవించాలని సీఐ ఎస్.రమేశ్ సూచించారు. ఉరుము గ్రామంలో శుక్రవారం గిరిజనులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కోడి పందాలు, జూదాలు, నాటుసారా క్రయ విక్రయాలు, గంజాయి సాగు, రవాణాకు దూరంగా ఉండాలని చెప్పారు. వీటిని అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం అవసరం

పాడేరు రూరల్, జనవరి 5: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం అవసరమని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎస్.విశ్వప్రసాద్ చెప్పారు. పాఠశాలలో ఎనిమిది నుంచి పదో తరగతి విద్యార్థులకు మానసిక పరివర్తన, మూఢ నమ్మకాలు తొలగడంతో పాటు సామాజిక విషయాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. గిరిజన విద్యార్థుల్లో విజ్ఞానం వెలికి తీసేందుకు ఈ శిక్షణ తరగతులు దోహదపడతాయన్నారు. అలాగే డోకులూరు, హుకుంపేట పాఠశాలల్లోనూ ఈ కార్యక్రమాలు నిర్వహిస్తామని సైన్స్ ఫర్ బెటర్ సొసైటీ జగదీష్ తెలిపారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న చంద్రశేఖర్

కొయ్యూరు, జనవరి 5: సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపడితే ఆయిల్‌పాం తోటల్లో అధిక దిగుబడులు సాధించవచ్చని పతంజలి కంపెనీ మేనేజర్ చంద్రశేఖర్ సూచించారు. మండలంలోని ఆడాకులు గ్రామంలో ఆయిల్‌పాం రైతులతో పంట ప్రాధాన్యత, యాజమాన్య పద్ధతులు తదితర విషయాలపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తోటల సంరక్షణ, పంటను ఆశించే చీడపీడల వల్ల కలిగే నష్టాలు, సస్యరక్షణ చర్యలు, దిగుబడి పెంచుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను మేనేజర్ చంద్రశేఖర్‌తో పాటు సహాయ మేనేజర్ రమేష్ వివరించారు. ఏరియా ఇన్‌చార్జి నాగేశ్వరావు పామాయిల్ నారుమొక్కల సరఫరా, ఇతర పంటల ప్రోత్సాహకాలను వివరించారు. కార్యక్రమంలో ఆడాకులు సర్పంచ్ అప్పారావు, ఉప సర్పంచ్ రాంబాబు, రైతులు పాల్గొన్నారు.